వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

దిగజారిన ప్రచారం

ఎన్నికల ప్రచారం ఎలా ఉండకూడదు అనడానికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగాలే ఓ ఉదాహరణగా నిలుస్తాయి. ఆయన స్థాయికి అవి ఏమాత్రం తగవని చెప్పడం చిన్నమాట అవుతుంది. ఇదివరకటి అటల్ బిహారీ వాజపేయీ తరహాలో కాకుండా ఈసారి బీజేపీ ప్రచారం నిండా మోదీయే పరుచుకున్నారు. అసాధారణమైన రీతిలో బీజేపీ మ్యానిఫెస్టోకు 'మోదీ గ్యారంటీ' అని పేరుపెట్టారు. ఒక్కమాటలో చెప్పాలంటే మోదీ మంత్రాన్నే బీజేపీ నమ్ముకున్నది. ఆయన కూడా ఎక్కడ చూస్తే అక్కడ తానే అన్నట్టుగా దేశమంతటా తిరుగుతూ సుడిగాలి ప్రచారం నిర్వహించారు. మార్చి 16 నుంచి మే 30వ తేదీ వరకు ఆయన 206 బహిరంగ సభలు, రోడ్ షోలలో 150 గంటల పాటు ప్రసంగించి, 80 ఇంటర్వ్యూల్లో వెయ్యి ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఇదొక రికార్డు అని కూడా అంటున్నారు. మోదీ ప్రచారంలో ఈ రాశికి తగ్గ వాసి కొరవడటం, చౌకబారుతనం పదేపదే తొంగిచూడటంపై దేశ ప్రజానీకం విస్మయానికి గురైంది.

అయితే ఏడు దశల ఎన్నికల్లో ఒక్కో విడత ముగుస్తున్నకొద్దీ మోదీ ప్రచార స్థాయి 'ఆకాశంబున నుండి.. శంభుని శిరంబందుండి శీతాద్రి' అన్నట్టుగా దిగజారుతూ వస్తున్న సంగతి గమనించవచ్చు. ఎన్నికలకు ముందు నాటి అంచనాలు పోలింగ్ సరళిని బట్టి తారుమారు అవుతుండటమే అందుకు కారణమనే మాట బలంగా వినిపించింది. బీజేపీ ఓడిపోతున్నదనే జోస్యాలు అంతకంతకూ ఊపందుకోవడం మొదలైంది. ముఖ్యంగా బీజేపీకి కంచుకోట లాంటి ఉత్తరాదిలోనే ఎదురుగాలులు వీస్తున్నాయనే విశ్లేషణలు పెరుగుతూ పోతుంటే మోదీలో నిస్పృహ కట్టలు తెంచుకుంటున్నట్టు కనిపించింది.

పదేండ్ల కాలంలో తాను సాధించిన విజయాల గురించి గానీ, మళ్లీ అధికారమిస్తే రాబోయే రోజుల్లో సాధించే ఘనకార్యాల గురించి గానీ ప్రధాని మాట్లాడలేదు. ఆయన ప్రసంగాలన్నీ విపక్షాలను లక్ష్యంగా చేసుకునే సాగిపోయాయి. కాంగ్రెస్‌ను పెద్ద బూచిగా చూపడం కొంచెం శృతి మించింది. మతపరమైన భావజాలం కట్టలు తెంచుకుంది. కాంగ్రెస్ గెలిస్తే వారసత్వ పన్నులు వేస్తారనీ, అందరి సొమ్ము పోగు చేసి కొందరికే ఇస్తారనీ, రాజస్థాన్ ప్రచారంలో ఓటర్లను మోదీ హెచ్చరించారు. ఆ తర్వాత ఏకంగా కాంగ్రెస్‌వారు మహిళల మెడల్లోనుంచి మంగళసూత్రాలూ లాగేసుకుంటారు అనేదాకా పోయారు. అధిక సంతానం కలిగి ఉండేవారు, సరిహద్దులను దాటి వచ్చేవారు అంటూ ఒకవర్గాన్ని లక్ష్యంగా చేసుకుని మాట్లాడారు. దీనిపై దుమారం చెలరేగింది. విపక్షాలు ఒత్తిడి తేవడంతో ఎన్నికల సంఘం సుతిమెత్తగా అయినా మందలించక తప్పలేదు. ఈ పరనింద ఇలా కొనసాగిస్తూనే ఆత్మస్తుతిలో పడిపోయారు. 'నన్ను దైవం పంపింది' అనే దగ్గర మొదలుపెట్టి 'నేనే దేవుణ్ణేమో' అనేదాకా వెళ్లిపోయారు. జాతిపిత గాంధీజీ గురించి తాజాగా చేసిన వ్యాఖ్య ఈ పతనావస్థకు పరాకాష్ఠ.

అటెన్‌బరో దర్శకత్వంలో 1982లో విడుదలైన ఆంగ్ల చిత్రం గాంధీ వల్లనే మహాత్మునికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వచ్చిందని ప్రధాని స్థాయి వ్యక్తి అనడం ఏ రకంగానూ ఆమోదయోగ్యం కాదు. శోభస్కరం అంతకంటే కాదు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో గాంధీ నిర్వహించిన పాత్ర ఏమిటో కొత్తగా చర్చించాల్సిన విషయం కానేకాదు. ప్రపంచవ్యాప్తంగా ఆయన అభిమానులు, అనుయాయులు అసంఖ్యాకంగా ఉన్నారు. ఒక మండేలా, ఒక మార్టిన్ లూథర్‌కింగ్.. ఇలా చెప్పుకుంటూ పోతే ఆయన మార్గాన పయనించి చరితార్థులైనవారెందరో చరిత్రకు సుపరిచితమే. 'ఇలాంటి ఒక మానవుడు రక్తమాంసాలతో ఈ భూమ్మీద నడిచాడా' అని రాబోయే తరాలు విస్తుపోతాయని ప్రముఖ శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ అర్పించిన నివాళి జగత్ప్రసిద్ధం. గాంధీజీ ఈ దేశంలో, ఆ మాటకు వస్తే ప్రపంచంలో చర్చాంశం కాకుండా ఎన్నడూ పోలేదు. కానీ ఈ దేశ పరిపాలనా వ్యవస్థ శిఖరస్థానంలో ఉన్న మోదీ దీంతో విభేదిస్తుండటం విస్మయం కలిగిస్తున్నది. ఆయనకు సొంత అభిప్రాయాలు ఉండొచ్చు. లేదా బీజేపీ భావజాలంలో అదొక భాగమై ఉండొచ్చు. కానీ ప్రభుత్వాధినేతగా బహిరంగంగా వ్యాఖ్యానించడం మాత్రం సమర్థనీయం కాదు. వివాదాల జోలికి పోని సౌమ్యుడిగా పేరున్న మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చెప్పినట్టుగా మోదీ ప్రసంగాలు ప్రధాని పదవి హుందాతనాన్ని దిగజార్చేవిగా ఉన్నాయనేది అక్షరసత్యం.

ప్రసంగాలతో గౌరవాన్ని దిగజార్చారు

ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్షాలను, ఓ వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని విద్వేషపూరిత ప్రసంగాలు చేసిన తొలి ప్రధానిగా మోదీ చరిత్రలో నిలిచారు. తన అనుచిత వ్యాఖ్యలతో ప్రధాని కార్యాలయం హుందాతనాన్ని ఆయన దిగజార్చారు.

- మన్మోహన్‌సింగ్, మాజీ ప్రధానమంత్రి

రాజనీతిజ్ఞుడికి అపజయమే లేదు

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను గతేడాది జూన్ 2న ప్రారంభించి 21 రోజుల పాటు దిగ్విజయంగా నిర్వహించారు. ఆ ఉత్సవాలకు కొనసాగింపుగానో, లేదా వాటికి సంబంధం లేకుండానో రాష్ట్రం ఏర్పాటై పదేండ్లు పూర్తి కావస్తున్న సందర్భంగా ఈ ఏడాది జూన్ 2న దశాబ్ది ఉత్సవాలు జరపాలని రాష్ట్ర మంత్రివర్గం బృహత్తర ప్రణాళికను రూపొందించింది. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా సోనియాగాంధీని ఆహ్వానించాలని క్యాబినెట్ నిర్ణయించింది. దీంతో నిమిత్తం లేకుండా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ మూడు రోజుల పాటు ఉత్సవాల ముగింపు వేడుకలను నిర్వహించాలని ప్రణాళికలు రచిస్తున్నది.

వనం జ్వాలా నరసింహారావు

1956 నుంచి అప్రతిహతంగా సాగిన తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం చారిత్రాత్మకమైన ఒక ఎడతెగని అవిశ్రాంత, నిరంతర పోరాటం. ఏ ఒక్క వ్యక్తి కానీ, ఒక్క గ్రూపు కానీ, ఒక్క రాజకీయ పార్టీ కానీ, ఒకరిద్దరు మేధావులు కానీ, ఒకరిద్దరి రచనలు-పాటలు కానీ, కొందరి ఎలక్ట్రానిక్ మీడియా విశ్లేషణలు కానీ, పత్రికా వ్యాసాలు కానీ కాకుండా, వీరందరితో సహా ఆబాల తెలంగాణ గోపాలం, అనేక మంది మరువబడ్డ, మరుగునబడ్డ వీరుల పోరాట కారణంగానే 2014 జూన్ 2న ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించింది. ఈ మహనీయులందరి గురించి సమకాలీన వర్తమాన తెలంగాణ చరిత్రలో అదెప్పుడు నిష్పాక్షికంగా రాస్తే అప్పుడే సువర్ణాక్షరాలతో లిఖించడం సమంజసం. కానీ, ఎంపిక చేసిన ఏ ఒకరిద్దరినో ప్రభుత్వ పరంగానో, కొన్ని ప్రభుత్వేతర సంస్థల పరంగానో సన్మానించడం బహుశా అంతగా సబబు కాదేమో!

అయితే, తెలంగాణ రాష్ట్ర సాధనకు ఎంతోమంది ఎన్నో విధాలుగా కారణభూతులైనప్పటికీ అత్యున్నత నాయకత్వ స్థాయికి చెందిన కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు మలిదశ ఉద్యమంలో తనదైన శైలిలో, మహాత్మాగాంధీ చూపించిన సంపూర్ణ శాంతియుత పోరాట నమూనాలో రాష్ట్ర సాధన ఉద్యమానికి సారథ్యం వహించారు. అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి నడిపించారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు దిశగా దేశంలోని 36కు పైగా రాజకీయ పార్టీలను ఒప్పించారు. ఆ సమయంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి, ప్రతిపక్షంలో ఉన్న బీజేపీకి తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయడం మినహా గత్యంతరం, ప్రత్యామ్నాయం లేకుండా చేశారు. అందువల్ల లిఖించబోయే సమకాలీన వర్తమాన తెలంగాణ చరిత్రలో, ముఖ్యంగా 'తెలంగాణ ఆవిర్భావం, తెలంగాణ అభివృద్ధి' అధ్యాయాలలో కేసీఆర్ పేరు అగ్రభాగాన, సవివరంగా ఉండటం అత్యంత సమంజసం.

రాష్ట్ర ఏర్పాటు తర్వాత ప్రజల అభీష్టం మేరకు తొలి, మలి ముఖ్యమంత్రిగా ఎన్నికై తొమ్మిదిన్నరేండ్ల పాటు పదవిలో ఉన్న కేసీఆర్.. జార్జ్ బెర్నార్డ్ షా ఒకానొక ప్రబోధానికి ప్రతిరూపంగా ఉన్నారని చెప్పవచ్చు. 'సాధారణ ప్రజలు ప్రపంచానికి అనుగుణంగా మారుతారు. అసాధారణ వ్యక్తి ప్రపంచాన్నే తనకు అనుగుణంగా మార్చడానికి ప్రయత్నిస్తాడు. ప్రపంచ పురోగతి, బహుశార్థ అభివృద్ధి, వైవిధ్య భరితమైన మార్పు అసాధారణ వ్యక్తుల ద్వారా మాత్రమే జరుగుతుంది' అని బెర్నార్డ్ చెప్పిన వాక్యాలు కేసీఆర్ విషయంలో అక్షర సత్యాలు. అటువంటి అసాధారణ వ్యక్తి అయిన కేసీఆర్.. తన పదవీకాలంలో వినూత్నమైన ఆలోచనలతో (ఔట్ ఆఫ్ బాక్స్ థింకింగ్), పకడ్బందీ వ్యూహాలతో, సృజనాత్మకతతో సమస్యలకు పరిష్కారాలను కనుగొన్నారు. పాలనలో అద్భుతమైన కనీవినీ మార్పును తీసుకువచ్చారు. 'సంక్షేమం, అభివృద్ధి అంటే ఇదీ' అని సోదాహరణంగా, త్రికరణశుద్ధిగా చేసి చూపించారు. 'తినబోయే పదార్థం రుచి తినడంలోనే ఉంది' అన్న నానుడి ప్రకారం.. కేసీఆర్ తరహా తెలంగాణ అభివృద్ధి నమూనాను యావత్ దేశం ముందు సగర్వంగా ఉంచారు. దేశ చరిత్రలోనే ఈ నమూనా ఒక చెరిగిపోని, చెరపలేని ముద్రను వేసింది.

కేసీఆర్‌లో గాంధీయ విలువలు, నెల్సన్ మండేలా విధానం, విన్‌స్టన్ చర్చిల్ వ్యూహం, జవహర్‌లాల్ నెహ్రూ సిద్ధాంతం, లీ కువాన్ యూ నిబద్ధత, పీవీ నరసింహారావు ప్రగతిశీల సంస్కరణలు, డాక్టర్ ఎం.చెన్నారెడ్డి ఉద్యమ స్ఫూర్తి ప్రస్ఫుటంగా దర్శనమిస్తాయి. ఉదాహరణకు తన మొట్టమొదటి విదేశీ పర్యటనలో సింగపూర్‌ను సందర్శించినప్పుడు అక్కడి అసాధారణమైన, అద్భుతమైన అభివృద్ధిని చూసి ఆశ్చర్యపోయిన కేసీఆర్.. తెలంగాణ అభివృద్ధి విషయంలో అప్పటికే ఒక స్థిరాభిప్రాయానికి వచ్చినప్పటికీ సింగపూర్ అభివృద్ధి నమూనాను కూడా ఆదర్శంగా తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. సింగపూర్ మొదటి ప్రధాని లీ కువాన్ యూ లాగా కేసీఆర్ కూడా తెలంగాణ సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమంపై తదేక దృష్టిని సారించారు. సింగపూర్ జాతిపితగా పేరొందిన లీ కువాన్ యూ ఆ దేశాన్ని ధనిక దేశంగా, ప్రపంచంలో అత్యంత అభివృద్ధి చెందిన దేశంగా మార్చినట్టే.. కేసీఆర్ కూడా తెలంగాణ పితగా రాష్ట్ర ప్రజల ఆదరాభిమానాలను పొందడమే కాకుండా రాష్ట్ర జీఎస్డీపీ వృద్ధిలో, తలసరి ఆదాయం పెరుగుదలలో గణనీయమైన ఫలితాలు సాధించారు. దేశానికే ఆదర్శంగా తెలంగాణను నిలిపారు. లీ కువాన్ రాసిన 'సింగపూర్: ఫ్రం థర్డ్ వరల్డ్ టు ఫస్ట్' పుస్తకం గురించి కేసీఆర్ ఎప్పుడూ మాట్లాడేవారు.

> **భారతదేశ ప్రప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు కేసీఆర్‌కు కొన్ని ప్రాముఖ్యతాంశాలలో, ముఖ్యంగా పంచాయతీరాజ్ సంస్థలను బలోపేతం చేసే విషయంలో సమీప సారూప్యత ఉన్నది. అనేక సందర్భాలలో నెహ్రూ, 'ఎస్ కె డే'ల ప్రథమ కలయిక జరిగిన నేపథ్యం దరిమిలా ఆ అపురూప కలయిక మన దేశంలో గ్రామీణాభివృద్ధి దిశగా, పంచాయతీ రాజ్ స్థానిక సంస్థల, సహకార సంస్థల ఆవిర్భావానికి, సమాజాభివృద్ధికి ఎలా తోడ్పడిందో వివరించే వారు కేసీఆర్.**

వాస్తవానికి నెహ్రూ ప్రధాని అయిన కొత్తలో ప్రథమ పంచ వర్ష ప్రణాళిక రూపుదిద్దుకునే దశలో ఒక పర్యాయం అమెరికా పర్యటనలో ఉండగా.. ఆ దేశ అధ్యక్షుడు ఐసెన్ హోవర్ సూచనల మేరకు అతని సలహాదారుడు ఎస్ కె డేను కలిశారు. తొలుత స్వదేశానికి రావాలని నెహ్రూ ఆహ్వానించగా ఎస్ కె డే సున్నితంగా తిరస్కరించారు. అయితే భారత్‌లో నెహ్రూ నాయకత్వంలో జరుగుతున్న మార్పులను గమనించిన ఎస్ కె డే.. అమెరికాలో పెద్ద ఉద్యోగాన్ని వదులుకొని మరీ భారత్‌కు వచ్చారు. ఆ విధంగా పంచాయతీరాజ్, సహకార సంస్థల, కమ్యూనిటీ అభివృద్ధికి డే చేసిన కృషిని, నెహ్రూకు అందించిన సహకారాన్ని కేసీఆర్ స్ఫూర్తిగా తీసుకునేవారు.

నెహ్రూ ఆలోచనా సరళిలోనే పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం కోసం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని ఒక ఆదర్శ వేదికగా అభివృద్ధి చేశారు. ప్రతి గ్రామాన్ని సుసంపన్నంగా, దేనికదే ఒక ఆదర్శ గ్రామంగా, పచ్చదనంతో, పరిశుభ్రతతో పాటు స్థానిక స్వపరిపాలన పటిష్ఠపరించేందుకు ఉద్దేశించిన పంచాయతీరాజ్ చట్టం దేశానికే ఒక నమూనా చట్టం. దీని రూప కల్పనలో అలనాటి నెహ్రూ నిబద్ధత కేసీఆర్‌లో ప్రతిబింబిస్తుంది. భూ రికార్డుల ప్రక్షాళన, సమగ్ర సర్వే, ధరణి పోర్టల్ రూపకల్పన చేపట్టినప్పుడు కేసీఆర్‌ను చాలామంది పీవీ నరసింహారావుతో పోల్చారు. భూసంస్కరణల పునః ప్రారంభ మార్గదర్శకుడిగా కేసీఆర్ మన్ననలను పొందారు. అంతేకాకుండా డాక్టర్ మర్రి చెన్నారెడ్డి స్ఫూర్తిని తనలో నింపుకొని మలి దశ రాష్ట్ర మహోద్యమాన్ని విజయవంతంగా నడిపించారు.

మరో విషయంలో కూడా నెహ్రూతో కేసీఆర్‌ను దగ్గరగా పోల్చవచ్చేమో! ఏ విధంగానైతే గ్రామీణాభివృద్ధిలో నిపుణుడైన ఎస్ కే డేను దేశానికి ఆహ్వానించి దేశాబివృద్ధికి నెహ్రూ బాటలు వేశారో.. అలాగే కేసీఆర్ సైతం తెలంగాణ అభివృద్ధి కోసం వివిధ రాష్ట్రాలు, దేశాల్లో కీలక పదవుల్లో ఉన్న పలు రంగాల నిపుణులను స్వయంగా ఆహ్వానించారు. ఉదాహరణకు ప్రపంచ బ్యాంకు కన్సల్టెంట్‌గా సేవలందించిన ఆర్థిక రంగ నిపుణుడు డాక్టర్ జీఆర్ రెడ్డిని రాష్ట్ర ఆర్థిక సలహాదారుడిగా నియమించారు. కోల్ ఇండియా చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఐఏఎస్ అధికారి ఎస్.నర్సింగ్‌రావును సీఎం ముఖ్య కార్యదర్శిగా నియమించారు. రాష్ట్రాభివృద్ధిలో వారిద్దరి సహకారం గణనీయమైనది.

చైనాలో వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఎమర్జింగ్ మార్కెట్స్ ఎట్ క్రాస్ రోడ్స్' అనే అంశంపై కేసీఆర్ చేసిన ప్రసంగం ఆయనలో ఒక రాజనీతిజ్ఞుడిని, మహా పాలనాదక్షుడిని, సంపూర్ణ భారతీయుడిని ఆవిష్కరించింది. సర్వత్రా ప్రశంసలు అందుకున్నది. ఆర్థిక వ్యవస్థలపై సంపూర్ణ అవగాహనతో దేశాభివృద్ధి ప్రణాళికలకు అనుసరించాల్సిన వ్యూహాలపై చక్కని ఆలోచనతో నాడు కేసీఆర్ మాట్లాడారు. తెలంగాణలో పారిశ్రామిక, సమగ్రాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరిస్తూనే ప్రపంచ దేశాలకు భారతదేశం మార్గదర్శిగా నిలుస్తున్నదనే విషయాన్ని చాలా స్పష్టంగా చెప్పారు. ఆ సదస్సుతో కేసీఆర్ మహోన్నత వ్యక్తిత్వం గురించి ప్రపంచానికి తెలిసింది. తెలంగాణ ఉద్యమ నాయకుడిగా, రాష్ట్ర సాధకుడిగా మాత్రమే తెలిసిన కేసీఆర్ వీటన్నిటిని మించి గొప్ప దేశభక్తుడని, విశాల భావాలున్న పౌరుడని, భవిష్యత్తు జాతీయ (భారత) నాయకుడని రుజువైంది.

సర్ విన్‌స్టన్ చర్చిల్‌తో కూడా పోల్చదగ్గ వ్యక్తి కేసీఆర్. ప్రపంచవ్యాప్తంగా ఒక గొప్ప రాజనీతిజ్ఞుడిగా, రచయితగా, వక్తగా, నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న సర్ విన్‌స్టన్ చర్చిల్ ప్రణాళికా సరళి, వ్యక్తిత్వం గురించి కూడా ప్రత్యేకంగా చెప్పుకోవాలి. రెండవ ప్రపంచ యుద్ధం తీవ్రతరమైనప్పుడు 1940 మే నెలలో బ్రిటన్ ప్రధాని నెవిల్ చాంబర్లెయిన్ రాజీనామా చేయగా.. ఆయన స్థానంలో చర్చిల్ నియమితులయ్యారు. బ్రిటన్ ప్రధానిగా బిగ్ త్రీ (బ్రిటన్, రష్యా, యూఎస్) సఖ్యతను బలోపేతం చేయడం ఆయన వ్యూహంలో అతి ముఖ్యమైనది. ఆయన వ్యూహం ఫలించింది. తద్వారా జర్మనీ పరాజయం పాలైంది. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసింది. ప్రపంచంలోని అత్యంత ప్రముఖ రాజనీతిజ్ఞుడిగా, ప్రభావితం చేసే వ్యక్తిగా విన్‌స్టన్ చర్చిల్‌కు అరుదైన గుర్తింపు వచ్చింది.

అయినప్పటికీ బ్రిటన్ ఓటర్లు ఆయనను యుద్ధ కాల ప్రధానిగా మాత్రమే చూశారు. ఫలితంగా యుద్ధానంతరం 1945 ఎన్నికల్లో చర్చిల్ ఘోర పరాజయం పాలయ్యారు. ఆరేండ్ల విరామం తర్వాత తిరిగి 1951లో చర్చిల్ విజయం సాధించి రెండవ పర్యాయం ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అందుకు భిన్నంగా కేసీఆర్ రాష్ట్ర సాధన ఉద్యమంలో, ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లోనూ విజయం సాధించారు.

సమస్యలను వినూత్న, విభిన్న, తనదైన శైలిలో కేసీఆర్ పరిష్కరించేవారు. రాష్ట్ర ప్రజల సమగ్ర సంక్షేమం, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కేసీఆర్‌కు ప్రధానాంశం. రాజకీయాలను ఒక వికృత క్రీడలా చూసే వెకిలి మనస్తత్వం కాదాయనది. ఆయనకు అదొక టాస్క్, పవిత్రమైన కార్యం. తాను సాధించిన తెలంగాణ విషయంలో, రాష్ట్ర సమస్యలకు సంబంధించినంతవరకు పొరుగు రాష్ట్రాల విషయంలో, కేంద్ర దృక్పథం విషయంలో సుస్పష్టమైన, బలీయమైన అవగాహన, ఆలోచన ఆయనకు ఉన్నాయి. వీటన్నింటిలో తన స్వరాష్ట్ర ప్రాధాన్యతే ఆయనకు సర్వస్వం. తెలంగాణ స్వల్ప, మధ్య, దీర్ఘ కాలిక అవసరాల కోసం కఠినంగా ఉండాల్సినప్పుడు కఠినంగానూ, వెనక్కు తగ్గాల్సిన సందర్భాల్లో వెనక్కితగ్గేలా ఆయన వ్యవహరించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమం కోసం అవసరమైతే ఒక అడ్డ మైలు నడవడం ఆయన నిబద్ధతకు ప్రబల తార్కాణం.

> **ఎమ్మెల్యే నుంచి కేంద్ర మంత్రి వరకు పని చేసిన కేసీఆర్‌కు అపారమైన అనుభవం ఉంది. పాలనాపరమైన అనుభవంతో, ఉద్యమం నేర్పిన పాఠాలతో రాష్ట్ర, అవసరాలను అర్థం చేసుకున్న కేసీఆర్.. ముఖ్యమంత్రిగా పలు సమీక్షా సమావేశాల్లో అధికారుల అనుభవాన్ని, విజ్ఞానాన్ని పరిగణనలోకి తీసుకున్నారు. వారి విలువైన ఆలోచనలను గౌరవించారు. అవసరమైన సమయంలో మార్గనిర్దేశనం చేశారు. అంతేకాని తన ఆలోచనలను వారిమీద బలవంతంగా రుద్దేవారు కాదు.**

మార్పు తేవడం, మార్పులకు అనుగుణంగా పథకాల రూపకల్పన చేయడం, వాటిని అమలు పరచడం కేసీఆర్ విశిష్టత. ఎన్ని చేసినా, ఎంత చేసినా ప్రజలు మార్పు కోరుకున్నారు. అతి స్వల్ప ఓట్ల తేడాతో కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ఓటమి పాలైంది. రాజకీయ నాయకుడికి గెలుపే ప్రధానం. కానీ, రాజనీతిజ్ఞుడికి జయాపజయాలు రెండూ సహజ పరిణామాలే. అలెగ్జాండర్ డ్యూమాస్ చెప్పినట్టు.. 'విజయాన్ని మించిన విజయం లేదు' అనేది వందశాతం సరైనది కాదేమో! బహుశా వైఫల్యాలు భవిష్యత్తు విజయాలకు మూల స్తంభాలు కావచ్చేమో! వాస్తవానికి అపజయం అనేది తాత్కాలికంగా రద్దు అయిన విజయమే. అందుకే కేసీఆర్ నాయకత్వానికి అపజయం లేదనేది అసలుసిసలు వాస్తవం.

ఆత్మలను పలికించేదే..

రాష్ట్ర గీతంగా 'జయ జయహే తెలంగాణ'ను ఎంపిక చేయడంపై ఎవరికీ అభ్యంతరం లేదు. రాష్ట్ర ప్రభుత్వాలు ఈ గీతాన్ని రాష్ట్ర గీతంగా నిర్ణయించకముందే తెలంగాణ ప్రజానీకం ఈ పాటకు ప్రాణం పోశారు. అనేక సందర్భాల్లో నిత్యం పాడుకుంటున్నారు. వివాదం ఏమంటే మన పాటకు పరాయి స్వరాలు కూర్చడం. 'ఆత్మలను పలికించేదే అసలైన భాష, ఆ విలువ కరువైపోతే అది వట్టి కంఠశోష' అని అన్నారు మహాకవి సినారె. మన పాట మన నోట మన స్వరంలో పలికితే దాని అందం, దాని ఉద్దేశం వేరుగా ఉంటుంది. కవిగా అందెశ్రీ, సంగీత దర్శకునిగా కీరవాణి ఎవరికి వారు గొప్పవారు సందేహం లేదు. ఇది రాష్ట్ర గీతం. దీనికి స్థానికత, మట్టి పరిమళం, గుండెల్లో భక్తిభావం ఉట్టి పడాలి. పాట వింటుంటే నరనరాలు ఉప్పొంగి హృదయం ఆత్మగౌరవ పతాకై రెపరెపలాడాలి. ఇది ప్రధానోద్దేశం.

మరోటి ఏమంటే విభజన స్పష్టంగా జరిగిపోయింది. దశాబ్దం గడిచిపోయింది. పోరాడి తెచ్చుకున్న తెలంగాణ తరం ఇంకా కనుమరుగు కాలేదు. అవమానాల గుర్తులు చెరిగిపోలేదు. అందెశ్రీని ఉద్యమకాలం నుంచి భుజాల కెత్తుకున్నది తెలంగాణ ప్రజలే. రేపు రాష్ట్ర గీతం అయినంక తరాలు మారిన తర్వాత ఆనాడు తెలంగాణలో సంగీతవేత్తలు కరువై మనవాడిని బాణీలు కూర్చమని అర్థించారని పాఠ్యపుస్తకాల్లో రాస్తారు. మన అందెశ్రీ కీర్తి, తెలంగాణ వైభవం ఏమైతుందో ఆలోచించాలి. ఇది ఏ పార్టీల సమస్య కాదు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష. పట్టింపులకు పోకుండా వివేకంతో ఆలోచించాలి. పరాయిని నమ్మితే పరాభవం తప్పదు.

- కోట్ల వెంకటేశ్వర రెడ్డి, 94402 33261

రాచరికం పేరిట విధ్వంసం

తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ ప్రతీక అయిన కాకతీయ కళాతోరణాన్ని రాష్ట్ర అధికారిక చిహ్నం నుంచి తొలగించే ప్రయత్నాలు జరుగుతుండటం బాధాకరం. ఎంతో చరిత్ర గల కాకతీయ కళాతోరణానికి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మరింత గుర్తింపును తీసుకొచ్చారు. కేసీఆర్ సూచనల మేరకు కళాకారుడు ఏలె లక్ష్మణ్ రూపొందించిన తెలంగాణ అధికారిక చిహ్నంలో చార్మినార్, కాకతీయ తోరణాలకు చోటు దక్కడం ఈ ప్రాంతగంగా జమునా తెహజీబ్‌కు, ఘన వారసత్వానికి నిదర్శనం. చరిత్రను తెలుసుకోకుండా కాకతీయ కళా వైభవాన్ని ప్రస్తుత రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి రాచరికపు ముద్రలని పేర్కొనడం శోచనీయం. రాచరికం పేరు మీద విధ్వంసం చేయడం సబబేనా? కాకతీయులు తవ్వించిన చెరువులను, యునెస్కో గుర్తించిన రామప్ప కట్టడాలను చరిత్రలో లేకుండా చేస్తారా? అందెశ్రీ రాసిన 'జయజయహే తెలంగాణ జననీ జయకేతనం' పాటను రాష్ట్ర గీతంగా ప్రకటించడం స్వాగతించదగిన విషయమే. కానీ, కాకతీయులు, గోలుకొండ నవాబుల గురించి ప్రస్తావించిన పాటను రాష్ట్ర గీతంగా నిర్ణయించి.. తెలంగాణ చరిత్రకు ఆనవాళ్లు అయిన కాకతీయ తోరణం, చార్మినార్‌ను చిహ్నం నుంచి తొలగించాలనుకోవడం సీఎం రేవంత్‌రెడ్డి అవగాహనారాహిత్యానికి, అపరిపక్వతకు నిదర్శనం. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాన్ని తెలంగాణ ప్రజలందరూ ముక్తకంఠంతో వ్యతిరేకించాలి.

- ఆలేటి రమేశ్, 99487 98982

హైదరాబాద్ అంటేనే చార్మినార్

తెలంగాణ సాంస్కృతిక చిహ్నాలను ఏవో కారణాలు చూపి తీసేయ ప్రయత్నించడాన్ని వ్యతిరేకిస్తున్నాం. ఇందుకుగాను ప్రభుత్వం చెప్పే కారణాలు సముచితం కాదు. కాకతీయ రాజుల పాలన గురించి తెలంగాణలోని మెజారిటీ ప్రజలకు సదభిప్రాయమే ఉన్నది. కాకతీయులు నిర్మించిన గొలుసుకట్టు చెరువులకు ఉన్న ప్రాశస్త్యం తెలిసిందే. గొలుసు కట్టు చెరువుల వల్ల వాన నీటిని వృథా కాకుండా నిల్వ చేసి తెలంగాణ ప్రాంతం సస్యశ్యామలం అవడానికి కాకతీయులు కృషిచేశారు. ఆ చెరువులను కుతుబ్‌షాహీ రాజులు, నిజాం రాజులు కూడా జాగ్రత్తగా కాపాడారు. ఆంధ్రా పాలకులు నిర్లక్ష్యం చేయడం వల్ల ఆ చెరువుల గొలుసు కట్టు తెగిపోయింది. తెలంగాణ వచ్చాక కేసీఆర్ ప్రభుత్వం చెరువులను బాగుచేసింది. ఇలాంటి చరిత ఉన్న కాకతీయుల తోరణంలో రాచరిక పోకడలు కూడా లేవు. తెలంగాణ ముఖద్వారంగా అది ప్రశస్తి పొందింది. అలాంటి చిహ్నాన్ని తీసేయాలని చూడటం సరైంది కాదు. హైదరాబాద్ అనగానే భారతీయులు, విదేశీయులు మొదటగా చార్మినార్ గుర్తుకువస్తుంది. ఇది రాచరిక చిహ్నం కాదు. హైదరాబాద్ నగరంలో ప్లేగు వ్యాధి వచ్చి వేలాది మంది చనిపోతే ఆ మహమ్మారి చేసిన విపత్తుకు స్మృతి చిహ్నంగా చార్మినార్ కట్టించాడు కుతుబ్‌షాహీ రాజు కులీ కుతుబ్ షా! 400 ఏండ్లుగా అది తెలంగాణకు, హైదారాబాద్‌కు గుర్తుగా ఉన్నది. దాన్ని రాష్ట్ర చిహ్నంలో కేసీఆర్ పెట్టాడు కాబట్టి, ఇప్పుడు తొలగించాలని చూడటం సరైంది కాదు.

- సింగిడి తెలంగాణ రచయితల సంఘం

మార్చాల్సిన అవసరమేముంది?

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేండ్లవుతుంది. ఈ సందర్భంగా ప్రభుత్వం రాష్ట్ర చిహ్నంలో రాచరికపు గుర్తులు ఉండకూడదని, దానిని మార్చే ప్రయత్నం చేస్తున్నది. ప్రభుత్వాలు మారిన